అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేలా కృషి

జీహెచ్ఎంసీలో గణతంత్ర వేడుకలో కమిషనర్ ఇలంబర్తి

సిటీబ్యూరో, జనవరి 26(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించే దిశగా కృషి చేస్తామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. వచ్చే నెల మొదటి వారంలో వార్డుల వారీగా గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతలతో కలిసి కమిషనర్ ఇలంబర్తి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు మేయర్, కమిషనర్లు పోలీస్ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా నగరంలో చేపట్టిన అభివృద్ధిని కమిషనర్ ఇలంబర్తి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, నళినీ పద్మావతి, పంకజ, గీత రాధిక, సుభద్రాదేవి, సత్యనారాయణ, రఘు ప్రసాద్, యాదగిరి రావు, సీఈలు భాస్కర్ రెడ్డి, కోటేశ్వర రావు, సీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ డాక్టర్ అబ్దుల్ వకీల్, జాయింట్ కమిషనర్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

జల మండలిలో..

సిటీబ్యూరో, జనవరి 26(నమస్తే తెలంగాణ): జల మండలిలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో ఆదివారం జరిగిన ఈ వేడుకలకు ఎండీ అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాలాపన చేశారు. కార్యక్రమంలో ఈడీ మయాంక్ మిట్టల్, ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్లు స్వామి, సుదర్శన్, అమరేందర్ రెడ్డి, సీజీఎం, జీఎం, ఉద్యోగులు, వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మిన్నంటిన గణతంత్రం

సిటీబ్యూరో, జనవరి 25(నమస్తే తెలంగాణ): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బుద్ధభవన్ లోని హైడ్రా కార్యాలయంలో ఆదివారం వేడుకలు ఘనంగా జరిగాయి. రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ 2025వ సంవత్సరం హైడ్రాకు ఎంతో కీలకమైనదని, చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ, ప్రభుత్వ భూములను కాపాడేందుకు ప్రతి ఒక్కరు కంకణబద్ధులు కావాలని హైడ్రా సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో..

ఖైరతాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా జేటీసీ రమేశ్ పతాకావిష్కరణ చేసి స్వాతంత్ర్య సమరయోధులకు, రాజ్యాంగకర్తలకు నివాళులర్పించారు. రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతి ఒక్కరు పనిచేయాలని జేటీసీ రమేశ్ కోరారు.

హైడ్రా కార్యాలయంలో జెండాఆవిష్కరించి రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో జెండా ఎగురవేసిన జేటీసీ రమేశ్

మెట్రో ఆధ్వర్యంలో..

సిటీబ్యూరో, జనవరి 26(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ప్రధాన కార్యాలయాల్లో ఘనంగా గణతంత్ర వేడుకలను నిర్వహించారు. ఆయా కార్యాలయాల్లో ఆదివారం జరిగిన జెండా ఆవిష్కరణలో హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో హెచ్ఎండీఏ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. విశ్వనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు అధికారులు సిద్ధం కావాలని మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అన్నారు. మెట్రో ఎండీ ఎన్వీఎస్ మాట్లాడుతూ.., నగరంలో మెట్రో విస్తరణ పనులు మొదలైన నేపథ్యంలో ఇంజనీర్లు హైదరాబాద్ మెట్రోకు పునరంకితం కావాలన్నారు. నూతన శక్తితో హైదరాబాద్ అభివృద్ధి కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు.

జిల్లా సర్వతో ముఖాభివృద్ధికి కృషి

రిపబ్లిక్ డే వేడుకల్లో కలెక్టర్ అనుదీప్

సిటీబ్యూరో, జనవరి 26(నమస్తే తెలంగాణ): జిల్లా సర్వతో ముఖాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. హైదరాబాద్ జిల్లాలోని పలు శాఖలలో అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి కలెక్టర్ వివరించారు. అనంతరం, జిల్లా అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరవన్ పలాని, ముకుందరెడ్డి, అర్డీవో వెంకటాచారిలతో పాటు పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టరేట్‌లో పతాకావిష్కరణ చేస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

కొత్త వ్యవసాయ మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలి

సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతుల ర్యాలీ

కవాడిగూడ, జనవరి 26: కొత్త వ్యవసాయ మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలని, పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని, రుణమాఫీ చట్టాన్ని అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. జాతీయ కమిటీ పిలుపు మేరకు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ నుంచి ఇందిరా పార్కు వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం, ఇందిరా పార్కు వద్ద జరిగిన సభలో సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ కన్వీనర్ పశ్య పద్మ మాట్లాడారు. కొత్త వ్యవసాయ మర్కెట్ విధానం రైతాంగాన్ని పూర్తిగా దెబ్బ తీసేదేనని అన్నారు. రైతు వ్యతిరేక కొత్త వ్యవసాయ విధానం తీసుకురావడం అంటే రైతు వ్యతిరేక మూడు చట్టాలను డొంక తిరుగుడు పద్ధతిలో అమలు చేయడానికి పూనుకోవటమేనన్నారు. ఫిబ్రవరి 8,9 తేదీలలో ఎంపీలను కలిసి వినతులు అందజేస్తామని, కొత్త విధానాన్ని రద్దు చేయడానికి పార్లమెంటులో చర్చించాలని కోరతామన్నారు. మార్చి 5 నుంచి 13 వరకు ధర్నాలు నిర్వహించి ఉద్యమాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్తామన్నారు.

గణతంత్రాన్ని పండుగలా జరుపుకోవాలి

ఏసీబీ మాజీ డీజీ పూర్ణ చందర్‌రావు

సిటీబ్యూరో, జనవరి 26(నమస్తే తెలంగాణ): దసరా, క్రిస్మస్ తరహాలో గణతంత్ర దినోత్సవాన్ని ఒక పండుగగా జరుపుకోవాలని తెలంగాణ ఏసీబీ మాజీ డీజీ పూర్ణ చందర్ రావు తెలిపారు. ఎస్ఎంఆర్ వినయ్ సిటీ గేటెడ్ కమ్యూనిటీలో ఆదివారం జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ క్రీడల్లో గెలిచిన వారికి బహుమతులను అందజేశారు. ఎస్ఎంఆర్ వీసీ ప్రెసిడెంట్ జాన్సన్, వీహెచ్ రామకృష్ణన్, హిమాన్షు, సురేశ్, నవీన్ రెడ్డి, సతీశ్, హిమబిందు, మధు మిత్ర, శివాంగి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐలో...

నగరంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యాలయంలో 76వ గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చీఫ్ మేనేజర్ రాజేశ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వర్ణిమ్ భారత్ – విరాసత్ ఔర్ వికాస్ థీమ్‌తో దేశాభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. దేశంలోని అత్యుత్తమ బ్యాంకింగ్ సేవలను అందించేందుకు ఎస్బీఐ కృషి చేస్తుందన్నారు.

– సిటీబ్యూరో, జనవరి 26 (నమస్తే తెలంగాణ);

అభివృద్ధి పథంలో మేడ్చల్

కలెక్టరేట్‌లో ఘనంగా 76 గణతంత్ర దినోత్సవం

మేడ్చల్, జనవరి 26(నమస్తే తెలంగాణ): మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో, ఇంకా ఎంతో ముందంజలో ఉందని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అధికారుల, ప్రజాప్రతినిధుల సమన్వయం, సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఆదివారం 76 గణతంత్ర దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గౌతమ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసులు గౌరవ వందనం స్వీకరించారు. ప్రజలకు సంక్షేమ పథకాలను అందించేలా అధికారులు కృషి చేయడంతో పాటు జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం, ఉద్యోగ నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసా పత్రాలను కలెక్టర్ గౌతమ్ అందజేశారు. కార్యక్రమంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, రాధికా గుప్తా, డీఆర్వో హరిప్రియ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమ్ తదితరులు

డా. రావూస్ ఈఎన్టీలో విజయవంతంగా కాక్లియర్ ఇంప్లాంట్

సిటీబ్యూరో, జనవరి 26(నమస్తే తెలంగాణ): పుట్టుకతో వినికిడి లోపం ఉన్న పిల్లలకు డా. రావూస్ ఈఎన్టీ హాస్పిటల్‌లో కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలను విజయవంతంగా జరిపినట్లు నిర్వాహకులు తెలిపారు. రూ.10 లక్షల ఖరీదైన ఈ సర్జరీలను పేద పిల్లలకు ఉచితంగా జరిపినట్లు తెలిపారు. పుట్టుకతో వినికిడి లోపం ఉన్న పిల్లలకు చిన్నతనంలోనే సరైన చికిత్స చేయకపోతే వారు జీవితాంతం మూగ, చెవుడుతో బాధపడాల్సి వస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని పేద పిల్లలకు పైసా ఖర్చు లేకుండా 'డెఫ్ ఫ్రీ ఇండియా' అనే నినాదంతో డా. రావు తన బృందంతో కలిసి రెండు రోజుల్లోనే 10 కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు చేసినట్లు దవాఖాన వర్గాలు తెలిపాయి.

మేడ్చల్ మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులు

మేడ్చల్, జనవరి 26(నమస్తే తెలంగాణ): కార్పొరేషన్, మున్సిపాలిటీల ప్రజాప్రతినిధుల పదవీ కాలం పూర్తయిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. మేడ్చల్ జిల్లాలోని 4 కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీలకు అధికారుల నియామక ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. బోడుప్పల్ కార్పొరేషన్‌కు ప్రత్యేక అధికారిగా శ్రీనివాస్ రెడ్డి (ఎంఆర్‌డీఎసీఎల్ డైరెక్టర్), దమ్మాయిగూడ మున్సిపాలిటీకి ప్రత్యేక అధికారిగా రాధికా గుప్తా, దుండిగల్ మున్సిపాలిటీకి సాయినాథ్ (డీడీఎంఏ), ఘట్‌కేసర్‌కు రాధికా గుప్తా(అడిషనల్ కలెక్టర్), గుండ్ల పోచంపల్లికి రఘుప్రసాద్ (ఏడీఎంఏ అడిషనల్ కమిషనర్), జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు సంధ్య(సీడీఎంఏ), కొంపల్లి మున్సిపాలిటీకి చంద్రమోహన్ (ఎంఏయూడీ సెక్షన్ ఆఫీసర్), మేడ్చల్‌కు నారాయణ రావు(సీడీఎంఏ), నాగారానికి రాధికా గుప్తా (అడిషనల్ కలెక్టర్), నిజాంపేట్ (అడిషనల్ కమిషనర్ ఏడీఎంఏ), పీర్జాదిగూడ కార్పొరేషన్లకు శ్రీనివాస్ రెడ్డి (ఎండీఎంఏ డైరెక్టర్), పోచారం మున్సిపాలిటీకి శ్రీనివాస్ రెడ్డి (ఎండీఎంఏ డైరెక్టర్), తూకుంటలకు సంధ్య (సీడీఎంఏ)లను నియమించారు.

అదనపు కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్‌కు పురస్కారం

సిటీబ్యూరో, జనవరి 26(నమస్తే తెలంగాణ): ఆదివారం జరిగిన రిపబ్లిక్ డే వేడుకలలో నగర పోలీస్ అదనపు కమిషనర్ (శాంతి భద్రతలు) విక్రమ్ సింగ్ మాన్ రాష్ట్రపతి మెడల్‌తో పాటు ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాలను విజయవంతంగా పూర్తి చేయడంలో విశేషంగా కృషి చేసిన సందర్భంగా ఆయనకు తెలంగాణ ప్రభుత్వం ప్రశంసా పత్రాన్ని అందించి సత్కరించింది. ఈ మేరకు ఆయనకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందించారు.

కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో...

76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బెంగుళూరులోని కెనరా బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో సత్యనారాయణ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ భావాలను పెంపొందించాలన్నారు.

– సిటీబ్యూరో, జనవరి 26 (నమస్తే తెలంగాణ);

ఎస్టీపీని సందర్శించిన జల మండలి అధికారులు

సిటీబ్యూరో, జనవరి 26(నమస్తే తెలంగాణ): అంబర్‌పేట ఎస్టీపీ నిర్మాణ పనులను యుద్ధ ప్రతిపాదికన చేపట్టి మార్చి 1వ తేదీలోపు పూర్తి చేయాలని జల మండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. ఈడీ మయాంక్ మిట్టల్, ప్రాజెక్టు అధికారులతో కలిసి ఎండీ ఆదివారం ఎస్టీపీని సందర్శించారు. ఎస్టీపీ నిర్మాణ స్థితిగతుల్ని పరిశీలించారు. వివరాలను అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. సివిల్ పనులు పూర్తయ్యాయని, ఎలక్ట్రో మెకానికల్ పనులు జరుగుతున్నాయని అధికారులు ఎండీకి వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డివిజన్–1 జీఎం, అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారి విధానాలకు బీజేపీ జై..

ఎమ్మెల్యే కూనంనేని

కాచిగూడ, జనవరి 26: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం బడా కార్పొరేట్ కంపెనీలు, గుత్తేదారులకు ఊడిగం చేస్తూ, పెట్టుబడిదారి అనుకూల విధానాలతో చట్టాలను రుపొందిస్తుందని కొత్తగూడెం సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఏపీటీబీఈఎఫ్ 30వ త్రైవార్షిక మహాసభలు ముగింపు రోజు ఆదివారం కాచిగూడ మున్నూరు కాపు సంఘం మ్యాడం అంజయ్య హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సాంబశివరావు, ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం, ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి బీఎస్ రాంబాబు, ఏపీటీబీఈఎఫ్ అధ్యక్షుడు రవీంద్రనాథ్, ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి వంక ఉదయ్ హాజరయ్యారు. అనంతరం, ఎమ్మెల్యే సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాకింగ్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు పాలకులు చేస్తున్న కుట్రలను బ్యాంకు ఉద్యోగులు సమర్థవంతంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కేంద్రం ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించేందుకు కుట్రలు చేస్తుందని ఆరోపించారు. భారతదేశం తట్టుకుని నిలబడటానికి కారణం ప్రభుత్వ బ్యాంకులేనని పేర్కొన్నారు. కుల, మతాల పేరుతో కాకుండా ఎన్నికల్లో ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా ప్రజా సంక్షేమమే ఎజెండాగా ఎన్నికల్లో పోటీ చేయాలని బీజేపీకి ఆయన సవాల్ విసిరారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, చిత్రంలో తదితరులు

ఘనంగా నమస్తేలో..

సిటీబ్యూరో, జనవరి 26 (నమస్తే తెలంగాణ): భారత గణతంత్ర వేడుకలను నమస్తే తెలంగాణ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని బంజారాహిల్స్‌లో నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ప్రధాన కార్యాలయంలో ఆదివారం జాతీయ జెండాను ఆవిష్కరించి, స్వాతంత్ర్య సమర యోధుల పోరాట పటిమను స్మరించుకున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ చిరంజీవి, నమస్తే తెలంగాణ ఎడిటర్ కృష్ణమూర్తి, తెలంగాణ టుడే ఎడిటర్ శ్రీనివాస్ రెడ్డి, హెచ్ఆర్ మేనేజర్ మధుసూదన్, ఐటీ మేనేజర్ శివబాలన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎత్తైన శిఖరాలపై తెలంగాణ బిడ్డ తులసి రెడ్డి

దుండిగల్, జనవరి 26: కుత్బుల్లాపూర్, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేట్‌కు చెందిన యువకుడు పల్పునూరి తులసిరెడ్డి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఎత్తైన శిఖరాలను అధిరోహించడమే లక్ష్యంగా పెట్టుకొని ప్రపంచాన్ని చుట్టుతున్నారు. దేశ 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 22న దక్షిణ అమెరికాలో సముద్ర మట్టానికి 6,960 మీటర్ల ఎత్తులో ఉన్న అకొంకాగ్వా పర్వతాన్ని అధిరోహించి భారత జెండాను రెపరెపలాడించారు. తులసిరెడ్డి గతంలోనూ రష్యాలోని ఎత్తైన మౌంట్ ఎల్బర్స్ పర్వతాన్ని, ఆఫ్రికా ఖండంలోని కిలిమంజారో పర్వతాన్ని, లడక్‌లోని స్టాక్ కాంగ్రీ పర్వతాన్ని అధిరోహించి సత్తా చాటారు. ప్రపంచ పర్వత శిఖరాలను అధిరోహిస్తూ తమ గ్రామానికి మంచి పేరు తెస్తున్న యువకుడు తులసీరెడ్డిని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులు కోరారు.

అకొంకాగ్వా పర్వతంపై జాతీయ జెండాతో తులసి రెడ్డి

కొమురవెల్లి మల్లన్న ఆలయ రాజగోపురం వద్ద భక్తుల రద్దీ

లష్కర్ వారం.. పోటెత్తిన భక్తజనం

కిటకిటలాడిన కొమురవెల్లి ఆలయం

కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం లష్కర్ వారం సందర్భంగా మల్లన్న క్షేత్రానికి సికింద్రాబాద్, కరీంనగర్, మెదక్, వరంగల్, నల్లగొండ, ఖమ్మం తదితర ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 30 వేల మంది వరకు భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ ఈవో కె.రామాంజనేయులు తెలిపారు. పోతరాజుల విన్యాసాలు, బోనాలు, పట్నాలు, డప్పుచప్పుళ్లతో భక్తులు సందడి చేశారు. ఆదివారం వేకువజాము నుంచే భక్తులు గంటల పాటు క్యూలో నిలుచుండి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక దర్శనం, శీఘ్రదర్శనం, ధర్మదర్శనం ద్వారా భక్తులు ఆలయ అధికారులు దర్శన భాగ్యం కల్పించారు.

– చేర్యాల, జనవరి 26;

బీసీ గురుకులానికి దరఖాస్తులు

సిటీబ్యూరో, జనవరి 26(నమస్తే తెలంగాణ): మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల గురుకుల విద్యాలయాల్లో 2025వ సంవత్సరానికి 5వ తరగతి (ఆంగ్ల మాధ్యమం)లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ ఆదిత్య వర్మ తెలిపారు. రాత పరీక్ష కోసం ఆన్‌లైన్‌లో మీ సేవ కేంద్రాల ద్వారా ఫిబ్రవరి 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకు నాల్గో తరగతి చదివే వారు అర్హులన్నారు.